ప్రజాశక్తి
ఆదివారం 11 ఆగస్టు 2024
5
పార్వతీపురం మన్యం



12న నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - పార్వతీపురం

నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబిఎ) ప్రతిజ్ఞను ఈనెల 12న పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం సంబంధిత అధికారులు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం నివారించేందుకు 2020 ఆగస్టు 15న నషా ముక్త్ భారత్ అభియాన్ అనే సామూహిక అవగాహనా కార్యక్రమాన్ని సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ప్రారంభించిందన్నారు. ఈ ప్రతిజ్ఞా కార్యక్రమం సోమవారం 9 గంటలకు అన్ని విద్యా సంస్థలు, ఇతర ప్రజాసంస్థలు భాగస్వామ్యమవుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

నిజాలు రాసే పత్రికల్లో ప్రజాశక్తిదే అగ్రస్థానం

- ప్రజాశక్తి లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలి
- 44వ వార్షికోత్సవ సభలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజంలో ఉన్నది ఉన్నట్లు నిజాలు రాసే పత్రికల్లో ప్రజాశక్తి దే అగ్రస్థానమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ప్రజాశక్తి ప్రజల పత్రిక అని కొనియాడారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ సభ శనివారం జెడ్‌పి సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ముందుగా ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు చిత్రపటానికి అతిథులు కలెక్టర్ అంబేద్కర్‌తో పాటు విశిష్ట అతిథులు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు తదితతరులు కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాశక్తి ముద్రించిన 44వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ కె.రమేష్ నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రజాశక్తి కుటుంబ సభ్యులకు వార్షికోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. పత్రికా రంగంలో నేడు అనేక మార్పులు వస్తున్నాయని, సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా ఒక ఆశయం కోసం ఏర్పడిన పత్రిక ప్రజాశక్తి అన్నారు. పత్రిక ఏ భావజాలంతో, ఏ విలువలతో ఏర్పడిందో దానిని చివరి వరకు తీసుకెళ్లాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వాస్తవాన్ని నిర్భయంగా రాసినప్పుడే విలువ ఉంటుందన్నారు. తాము చేసే తప్పులు రాయడం వలన వాటిని సరిద్దిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు.



ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, డిఐపిఆర్ఒ డి.రమేష్, పిపిఎస్ఎస్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, తదితరులు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ నేడు సాంకేతికంగా వృద్ధి చెందుతున్న కాలంలో పత్రికలకు కొంత ఆదరణ తగ్గినప్పటికీ ప్రజల గొంతు వినిపించడంలో ప్రజాశక్తి ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. పత్రిక నడపడం, వార్తలు రాయడంలో అనేక సవాళ్లు ఉన్నప్పటికీ వాటిని ఎదుర్కొని ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రజాశక్తి ముందుకు సాగుతుందన్నారు. ప్రజాశక్తికి ఎప్పుడూ అండదండగా ఉంటామన్నారు. ప్రజాస్వామ్య వాదులు,ప్రజలు సహకారం ఉంటుందని తెలిపారు. ఏ లక్ష్యంతో ప్రజాశక్తి పని చేస్తుందో ఆ కృషిని మరింత ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు.

ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ సమాజంలో మూలస్తంభాల్లో ప్రతికలు ఒకటన్నారు. అయితే నేడు రాజకీయ పార్టీలకు అండగా మారిపోయిన పరిస్థితిలో ప్రజాశక్తి ప్రజల తరుపున ప్రజల పత్రికగా ఉండటం అభినందనీయమన్నారు. పత్రికలు నిష్పక్ష పాతంగా ఉన్నపుడే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. నేడు పత్రికలకు ధీటుగా సోషల్ మీడియా దూసుకుపోతోందని, ఈ పోటీ ప్రపంచంలో ప్రజాశక్తి కూడా సోషల్ మీడియాలో దూసుకుపోవాలని సూచించారు. నిష్పక్షపాతంగా ప్రజాశక్తి వార్తలు ఇస్తూ మరింత అభివృద్ధి కావాలని ఆకాక్షించారు.

పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో ప్రారంభమైన ప్రజాశక్తి అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడిందన్నారు. రాష్ట్రంలో తొలి తెలుగు దిన పత్రిక ప్రజాశక్తి అన్నారు. ఒక లక్ష్యంతో, సామాజిక బాధ్యతగా ఉందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నంలో ప్రజాశక్తిది అగ్రభాగమన్నారు. ప్రపంచంలోనే మన దేశంలో పత్రికా రంగంలో జర్నలిస్టులు సవాళ్లను, సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు, దళితులు, గిరిజనులు, పేదలు, కార్మికులు సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ప్రజల సహకారంతో నడుస్తోందని, మరింత ఎదుగుదలకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజలు పక్షం అనే నినాదంతో అప్రతిహతంగా ముందుకు సాగుతోందన్నారు. సమాజంలో జరుగుతున్న తప్పులు ఒప్పులను తెలియచేసే స్పష్టంగా, సూటిగా చెప్పే పత్రిక అని కొనియాడారు. సమాజం కోసం ఆలోచించే శక్తుల కోసం పని చేస్తుందన్నారు. నేడు సమాజంలో ఏదీ నిజమో తెలుసుకోవాలంటే ప్రజాశక్తి చదవాలన్నారు. సమాజం మార్పు కోసం, పేదలు,రైతులకు,కార్మికులు, దళితులు, గిరిజనులకు న్యాయం కోసం పత్రిక నడుస్తుందన్నారు. ప్రజాశక్తి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

జిల్లా సమాచార, పౌరసంబంధాలశాఖ అధికారి డి.రమేష్ మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రజలను చైతన్య పరిచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ప్రజా పక్షంగా ఉండటం వల్ల శాశ్వత పాఠకులు ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కార పత్రికగా ఉండాలన్నారు.

ప్రజాశక్తి శ్రీకాకుళం బ్రాంచి మేనేజర్ పి.కామినాయుడు మాట్లాడుతూ అనేక ఒడిదుడుకులు మధ్య పత్రిక నిలబడిందన్నారు. కరోనా సమయంలో కూడా అనేక ఇబ్బందులకు ఓర్చి నిలబడిందన్నారు. ప్రశ్నించే గొంతుకగా నిలబడిన ప్రజాశక్తి ప్రజల సహకారంతో 44 ఏళ్ల పత్రిక నిలబడటం గర్వంగా భావిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా అనేక విపత్కర పరిస్థితుల్లో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య మార్గదర్శకాల్లో, మోటూరు హనుమతురావు మార్గనిర్దేశనంలో ముందుకు నడుస్తోందన్నారు. మరింత అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. స్టాఫర్ రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రస్తానాన్ని వివరించారు. ప్రజా సమస్యలను వెలికి తీయడంలో ప్రజాశక్తి ముందుంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా జెవివి సభ్యులు డప్పు శ్రీను, పిఎన్ఎం కళాకారులు అభ్యుదయ గేయాలతో ఉర్రూతలూగించారు. సభలో ప్రజాశక్తి జిల్లా మేనేజర్ సిహెచ్ రాము, సిబ్బంది, ఉద్యోగులు, అధిక సంఖ్యలో అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



మోటూరు హనుమంతురావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు



ఆసుపత్రిలో విశ్రాంతి గదిని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

త్వరలో సాలూరులో వంద పడకల ఆస్పత్రి

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఏరియా ఆసుపత్రి అతి త్వరలో వంద పడకల ఆసుపత్రి కానుందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. రోగులతో వచ్చిన సహాయకులు సేద తీర్చుకునేందుకు సాలూరు ఆసుపత్రి ఆవరణలో రూ.3 లక్షలతో నిర్మించిన విశ్రాంత గదిని మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ అతి త్వరలో సాలూరులో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తామన్నారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతి పేదవానికి వైద్యం సక్రమంగా అందించాలని ఆమె చెప్పారు. పేదలు, దూరప్రాంత ప్రజలు ముఖ్యంగా గిరిజనులు ప్రభుత్వ ఆసుపత్రులపై ఎంతో నమ్మకంతో వస్తారని, కావున వారికి మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యులకు సూచించారు. గర్భిణులకు సరైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని స్పష్టం చేశారు. గర్భిణీలకు వైద్య పరీక్షలు నిరంతరం చేయాలని, రక్త హీనత, పౌష్టిక ఆహారం లోపం గుర్తించాలని సూచించారు. హైరిస్క్ అని గుర్తిస్తే తక్షణం గర్భిణుల వసతి గృహంలో చేర్పించాలని ఆమె ఆదేశించారు. ఎక్కడా డోలి మోతలు ఉండకూడదని, ఎఎన్ఎం, వైద్య సిబ్బంది పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఆమె స్పష్టం చేశారు. ఆసుపత్రిలోనే ప్రసవాలు జరగాలని, రహదారి మధ్యలో లేదా అంబులెన్సుల్లో ప్రసవాలు జరగరాదని ఆమె స్పష్టం చేశారు. డోలి మోతలు లేకుండా ప్రతి గ్రామానికి కనీసం ఫీడర్ అంబులెన్స్‌లు వెళ్లేలా రహదారుల నిర్మాణానికి ముఖ్యమంత్రి సంకల్పించారని ఆమె చెప్పారు.


అనంతరం ఎఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి, టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కౌన్సిలర్ టి.లక్ష్మోజీ, శ్రీ వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కాలేజి కరస్పాండెంట్ జగదీశ్వర రావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ కార్మికులు, కాంట్రాక్టర్ మధ్య

చర్చలు సఫలం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులు వేతనాలను పెంచాలని కోరుతూ గత ఐదు రోజులుగా విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సమస్యపై శనివారం సిఐటియు నాయకులు కార్మికులతో కలిసి కాంట్రాక్టర్‌తో పలుదఫాలు నిర్వహించిన చర్చలు సఫలమైనట్లు సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి జి.వెంకటరమణ తెలిపారు. కాంట్రాక్టర్ తాతబాబు గ్యారేజ్ ఇన్‌ఛార్జి ఎల్.రాము మధ్య చర్చలు జరిపి మెకానికల్ కార్మికులకు గతంలో రూ.13,500 ఉండేదని, ఇప్పుడు రూ.14300 ఇవ్వడానికి అంగీకారం కుదిరిందన్నారు. శ్రామికులకు రూ.8,500 గతంలో ఉండేదని, ఇప్పుడు రూ.9200 ఇవ్వడానికి అంగీకారం కుదిరింద న్నారు. దీంతో శనివారం రాత్రి నుంచి కార్మికులు విధుల్లో చేరేందుకు అంగీకరించడంతో చర్చలు ముగిసినట్లు నాయకులు తెలిపారు. అనంతరం నాయకులు, కార్మికులు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఒకపక్క సుప్రీంకోర్టు చెబుతుంటే మరోపక్క కార్మికుల శ్రమను ప్రభుత్వాలు, కాంట్రాక్టర్లు దోచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస భద్రత లేదని, ఒకపక్క నిత్యవసర వస్తువు ధరలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్, ఇంటి అద్దెలు, స్కూల్ ఫీజులు, వైద్యం ఖర్చులు పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులకు కనీసం వేతనం అమలు చేయక పోవడం, చాలీచాలని జీతాలు ఇవ్వడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటేష్, భాస్కరరావు, ఎం.కృష్ణకాంత్, గంగాధర్, బి.త్రినాధరావు, కె.కిరణ్‌కుమార్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, నాయకులు బంకుర సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టర్‌తో చర్చలు జరుపుతున్న సిఐటియు నాయకులు



యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

యుటిఎఫ్ ఆవిర్భవించి 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ ఆధ్వర్యంలో పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమానికి యుటిఎఫ్ పేటెంట్‌గా ఉందని, ఉద్యమ సారథిగా నిలిచిందని అన్నారు. ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించడానికి, విద్యారంగం సంరక్షణకు నిరంతరం సమరశీల పోరాటాలు చేస్తుందని అన్నారు. అందుకే రాష్ట్రంలో అగ్రగామి ఉపాధ్యాయ సంఘంగా వెలుగొందుతుందన్నారు. ఈ ఏడాది స్వర్ణోత్సవాలు సందర్భంగా ఉపాధ్యాయులకు ఆటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, జిల్లా కోశాధికారి కె.మురళి, జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీను, బి.జగన్నాథం, వసంత నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని కోమటి వీధి పాఠశాలల్లో శనివారం యుటిఎఫ్ స్వర్ణోత్సవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ ఎస్ రాజకుమారి, యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎస్ మహేష్ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు మాట్లాడుతూ యుటిఎఫ్ అగ్రశ్రేణి నాయకత్వం సీనియర్ నాయకులు వారసత్వాన్ని కొనసాగిస్తూ ఎత్తిన జెండా, పోరుబాట నిజాయితీ నిబద్ధతతో పనిచేస్తూ మరో 50 సంవత్సరాలు జెండాని మహోన్నతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. మండల అధ్యక్షులు బోనంగి దుర్గ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కూరరమాన గోవిందరావులు, ఎన్ సునీత నాయుడు, ఏ చంద్రమోహన్, కే గోవిందరావు, వి అన్నజీరావు, ఎస్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రెండు వారాల్లోనే పిఒలు బదిలీ

పశ్చిమగోదావరి జెసిగా సీతంపేట పిఒ ● విజయనగరం జెసిగా పార్వతీపురం పిఒ

ప్రజాశక్తి - సీతంపేట/పార్వతీపురంరూరల్

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు సేథుమాధవన్, టి.రాహుల్ కుమార్ రెడ్డి రెండు వారాల్లో బదిలీ కావడంతో ప్రజల్లో ఆశ్చర్యం కలిగింది. గతలనె 26న సీతంపేట ఐటిడిఎ పిఒగా బాధ్యతలు స్వీకరించగా, వారం రోజుల క్రితమే పార్వతీపురం పిఒగా మాధవన్ బాధ్యతలు స్వీకరించారు. రాహుల్‌కుమార్‌రెడ్డి పశ్చిమగోదావరి జిల్లా జెసిగా బదిలీ కాగా, సేధుమాధవన్ విజయనగరం జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. పిఒల ఆకస్మిక బదిలీ కావడంలో అంతర్యమేమిటని గ్రామస్తుల్లో చర్చ జరుగుతోంది.

ఇదిలా ఉండగా సీతంపేట ఐటిడిఎ పిఒ ఉన్న 14 రోజుల్లోనే గిరిజనులతో మమేకమై వారి మనసుల్లో ఒక ప్రత్యేక స్థానం సంపాదించారు. ప్రజా ప్రతినిధులను, అధికారులను కలుపుకొని వెళ్లేవారు. తక్కువ సమయంలోనే మంచి పేరు తెచ్చుకున్నారు. అలాగే సిబ్బందితో కూడా కలివిడిగా ఉంటూ ఐటిడిఎ అభివృద్ధికి ప్రక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ తరుణంలో పిఒ ఆకస్మిక బదిలీ కావడమేమిటని పలు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇప్పటికే ఏజెన్సీ అభివృద్ధిపై పర్యాటకం జీవనోపాధులు, స్కిల్ డెవలప్మెంట్, రహదారులు, విద్య, వైద్యం గ్రామాల్లో పబ్లిక్ గ్రీవెన్స్, వైటిసిలో గర్భిణీ హాస్టల్ తదితర ప్రణాళికలు రూపొందించారు. ఇటీవల ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కూడా ఘనంగా నిర్వహించారు. సమస్యలపై ప్రజలు నేరుగా కలవచ్చునని, గ్రామ, మండలాల్లో పబ్లిక్ గ్రీవెన్స్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అయితే ప్రాజెక్ట్ ఆఫీసర్ కాదు పీపుల్స్ ఆఫీసర్ అని అన్నారు. ఈ తరుణంలో బదిలీ కావడం అందరినీ కలిచి వేసింది. ఇంకా పిఒగా ఎవర్నీ ఎవరిని నియమించ లేదు.

సీతంపేట ఐటిడిఎ ముఖద్వారం వద్ద నిరసన

పిఒ రాహుల్ కుమార్ రెడ్డిని పశ్చిమ గోదావరి జిల్లా జెసిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన బదిలీ నిలిపి వేయాలని గిరిజన ప్రజాసమైక్య ఆధ్వర్యంలో స్థానిక ఐటిడిఎ కార్యాలయం ముఖ ద్వారం వద్ద ఎదుట నిరసన చేట్టారు. కార్యక్రమంలో గిరిజన ప్రజాసమైక్య జిల్లా అధ్యక్షులు మోహన్, ఉత్తరాంధ్రా జిల్లాల అధ్యక్షుడు సవర చిరంజీవులు, మోహన్, పాల్, బాలరాజు, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు. గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిడ్డిక తేజేశ్వరరావు పిఒ బదిలీపై స్పందిస్తూ సీతంపేట ఐటిడిఎ పిఒగా బాధ్యతలు చేపట్టి, గిరిజన సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తున్న అయన బదిలీ సరికాదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు నిలిపివేసి యధా విధిగా కొనసాగించాలని ఆయన కోరారు.



సీతంపేట ఐటిడిఎ వద్ద నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు, యువకులు

బదిలీల్లోనూ రాజకీయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



పోలీసుల లంటే సగటు ప్రజలకు ఓ భరోసా. ఆపదలో ఉన్నప్పుడు రక్షణగా నిలుస్తారని, అన్యాయం జరిగిన చోట బాధితుల పక్షాన నిలిచి అక్కున చేర్చుకుంటారని నమ్మకం. కానీ, నేడా పరిస్థితులు తలకిందులుగా కనిపిస్తున్నాయని జనం చర్చించుకుంటున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. నచ్చిన చోటకు బదిలీ కోసం డబ్బులు చేతబట్టుకుని క్యూ కడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. జిల్లాలో సిఐల బదిలీలో భారీగా ప్రజాప్రతినిధులకు ముట్టజెప్పారని బహిరంగంగా చర్చనడుస్తోంది. అలాగని తప్పంతా పోలీసులదే అని అనలేం కూడా. పుచ్చుకునే వారుంటే నచ్చిన చోటుకు వెళ్లేందుకు ఇచ్చేవారు ఉంటూనే ఉంటారు. కారణం ఏదైనా పోలీసుల బదిలీలు, పోస్టింగుల్లో మునుపెన్నడూ లేనంతగా రాజకీయ నాయకుల జోక్యం పెరిగిపోయింది. ఈ మాటకొస్తే బదిలీలు జరుగుతున్నప్పుడు రాజకీయ సిఫార్సులు సహజం. ప్రత్యేక పరిస్థితులు ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు ఆ మాత్రం రిఫరెన్స్ చేయడంలో తప్పులేదంటారు కొందరు. కానీ, మరీ ఇంతలా నోరున్నవాడిదే కూడు అన్నట్టుగా కాస్త మాటమెలికలు తిప్పి, పైకాన్ని ఎరవేసే వారికే కోరుకున్న చోట పోస్టింగులు ఇస్తామంటే ఎంత వరకు సమంజసం? అన్నది పలువురు సంధిస్తున్న ప్రశ్న. పోస్టింగుల కోసం డబ్బులిచ్చే రక్షక భటులు తిరిగి ఆ డబ్బులు రాబట్టుకోవడానికి ప్రయత్నించరన్న గ్యారెంటీ ఏమిటి? సిఫార్సులు చేసిన నాయకులు, లేదా ప్రజాప్రతినిధులు చెప్పుచేతల్లో బందీలు కాబోరని ఎవరైనా చెప్పగలుగుతారా? అని కూడా చాలా మందినోట వినిపిస్తున్న మాట. ఇలా సిఫార్సు చేసినవారే భవిష్యత్తులో అన్యాయం, అక్రమాలకు పాల్పడినవారికి అండగా నిలిస్తే పోలీసులు వారిని ఎదురించగలగుతారా? దీన్నిబట్టి పోలీసులు కూడా తమ స్వతంత్రతను కోల్పోవాల్సిన దుస్థితి ఉంటుంది. సరే....! రాజకీయ సిఫార్సులతో పోస్టింగులు వేయించుకున్నవారు, ఏ సిఫార్సులూ లేకుండా బదిలీవేటుకు గురైన వారు ఒకేలా పని చేయగలరా? అలా పనిచేస్తే ఊరుకునేంత సహనం అధికార పార్టీ నాయకులకు ఉంటుందా? ఇవన్నీ జనం నుంచి వినిపిస్తున్న సందేహాలే. ఉద్యోగులకు, అధికారులకు బదిలీలు అనేవి సర్వ సాధారణం. ఇందులో భాగంగా కొందరు పట్టణాల్లోనూ, మరికొందరు మైదానంలోనూ, ఇంకొందరు కొండకోణల్లోనూ పనిచేయాల్సి వస్తుంది. వారి సమర్థత, లేదా హోదాను బట్టి కూడా కొన్ని స్థానాలకు అనుకోకుండా వెళ్లాల్సివుంటుంది. ఇటువంటి సందర్భాల్లో కుటుంబ సమస్యలు ఉన్నవారికి, లేదా ఇతర అవసరాల రీత్యా ఉన్నతాధికారులు కూడా పోస్టింగుల విషయంలో కొంత వెసులుబాటు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఇది సహజం. కానీ, మాటకారులకు, డబ్బులు విరజల్లేవారికే నచ్చినచోట పోస్టింగులంటే... అదీ పోలీస్ శాఖలో ఉంటే ఊహలకందని పరిణామమే. ఇదే పరిస్థితి కొనసాగితే సగటు మనిషి దోపిడీకి గురైనా అడిగే నాధుడు కరువవుతాడనంలో ఎలాంటి సందేహం లేదు. పోలీసులు కూడా వారికున్న విలువలను కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పబ్లిక్ టాక్.


మంత్రి సంధ్యారాణిని సత్కరిస్తున్న రమేష్, తదితరులు

మంత్రి దృష్టికి హైస్కూల్ సమస్యలు

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా ఎంపికైన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ యడ్ల రమేష్‌కు స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అభినందనలు తెలిపారు. పాచిపెంటలో ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన రమేష్ విజయానికి కారకులైన మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబును కూడా అభినందించారు. అనంతరం రమేష్ పాఠశాల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వంట నిర్వాహకులకు ప్రత్యేకమైన షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే పిల్లలు భోజనం చేసేందుకు డార్మెటరీ నిర్మించాలని కోరారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించి త్వరలో నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని టిడిపి మద్దతుదారులైన పలువురు ఎస్ఎంసి చైర్మన్లను ఆమె అభినందించారు. ఆయనతోపాటు వై గోవింద రావు, సుభాని, పలువురు నాయకులు హాజరయ్యారు.


కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వైసిపి నాయకులు

ఇది రెడ్ బుక్ రాజ్యాంగం

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు జరగకుండా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందని మాజీ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీ వాణి అన్నారు. విజయవాడ నడిబొడ్డున గల అంబేద్కర్ న్యాయ మహాశిల్పంపై కూటమి దాడికి నిరసనగా నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో శనివారం రాత్రి స్థానిక బస్టాండ్ నుంచి వైఎస్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాలనే కూటమి ప్రభుత్వం ధ్వంసం చేస్తుంటే సామాన్యులకు ఏ విధంగా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. విగ్రహాలపై దాడులు, అరాచకాలు ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజ్, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి, జి సుజాత, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, వైఎస్‌పి జిల్లా అధికార ప్రతి శెట్టి నాగేశ్వరరావు, ఐదు మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు సంఖ్యలో పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ

సీతానగరం: మండలంలోని చినబోగిలి గ్రామంలో రైతు సంఘం జిల్లా నాయకులు బి అప్పారావు, సిహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రం వాయినాడ్ వరద బాధితుల కోసం శనివారం విరాళాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ప్రజలంతా ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవాలన్నారు. ఇది జాతీయ విపత్తుగా పరిగణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి జి వెంకటరమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు, ఆర్ రాము, రైతు సంఘం నాయకులు ఎంఎల్ నాయుడు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతం పట్ల హర్షం

పార్వతీపురంరూరల్ : ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచడంతో పాటు, బలోపేతం చేస్తామని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి లోకేష్ ప్రకటించడం హర్షనీయమని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరాపు సూర్యనారాయణ శనివారం తెలిపారు. సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రాజెక్టు అమలుకు సంబంధించి అధికారులతో మాట్లాడినప్పుడు ఐదేళ్లలో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అధికారులను ఆదేశించడం, సంతోషించే దగ్గర విషయమే అయినప్పటికీ, జీవో 117 రద్దు ద్వారా మాత్రమే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయని, ప్రభుత్వం భవించాలని అన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని సూర్యనారాయణ కోరారు. అందుకోసం ఉపాధ్యాయ సంఘం నాయకుల సూచనలు అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని విద్యామంత్రిని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

సీతానగరం: బుడ్డిపేట గ్రామానికి చెందిన నిరుపేద పట్నాన వెంకటమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడటంతో ఆ గ్రామానికి చెందిన యువత మానవతా దృక్పథంతో స్పందించి ఆమె వైద్య ఖర్చులు నిమిత్తం రూ.10వేలు, 25 కేజీల బియ్యం, ఒక ఫ్యాను, నిత్యవసర సరుకులను శనివారం అందించారు. యువత మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న వారికి మానవసేవే మాధవ సేవగా భావించి సామాజిక సేవా కార్యక్రమంలో ముందుండాలని కోరారు.

రోడ్డుపై వరి నాట్లు వేస్తూ నిరసన

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు వరకు గల అంతర్ రాష్ట్ర రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శనివారం చోళపదం వద్ద అంతర రాష్ట్ర రహదారి పై గోతులలో వరి నాట్లు నాటుతూ వినూత్నంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విధంగా వెంటనే రోడ్డు భవనాల శాఖ అధికారులు ప్రతిపాదనలు పెట్టిన కోటి రూపాయలు వెంటనే విడుదల చేసి పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాల కెళ్లే రహదారి పైన 14 చోట్ల ఏర్పడ్డ గోతులను పూడ్చాలన్నారు. గుంతలను పూడ్చకపోతే ఈనెల 20వ తేదీ దాటిన తర్వాత ఆ గోతుల వద్ద నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

ఎస్ఎంసి చైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే అభినందన

పార్వతీపురం రూరల్: సీతానగరం మండలం గెడ్డలుప్పి గ్రామ పాఠశాల ఎస్ఎంసి చైర్మన్‌గా ఎన్నికైన కర్రి బాలకృష్ణను శనివారం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. అందరూ కలిసికట్టుగా నడుచుకొని గ్రామాన్ని అభివృద్ధి పథంవైపు నడపాలని, తానెప్పుడూ మీకు అండగా నిలుస్తానని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు తిరుపతినాయుడు, ఎంపిటిసి పొటారి సత్యనారాయణ, వైస్ సర్పంచ్ చొంగల కిరణ్‌కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ కలిగి తవుడు, కార్యకర్తలు జి.తాతబాబు, పి.మురళీ తదితరులు పాల్గొన్నారు.

హోలీ క్రాస్ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి - భామిని

భామినిలో గల హోలీ క్రాస్ సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ ఆధ్వర్యంలో శనివారం ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంస్థ డైరెక్టర్ తెలిపారు. ఆదివాసీ వారసులు గిరిజనులకు సంపూర్ణ హక్కులు కలిగిఉండి, వారి ఆర్థిక అభివృద్ధికి సహకరించాలని వరల్డ్ సంస్థ డైరెక్టర్ సునీత అన్నారు.

17న ఎస్ఎంసి ఎన్నిక

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలో వాయిదా పడిన ఆరు పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నిక ఈ నెల 17న నిర్వహిస్తామని ఎంఇఒ సామల సింహాచలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న సభ్యుల కోరం లేక ఆరు పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయని వీటికి ఈ నెల 17న ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 12వ తేదీ వరకు ఓటరు జాబితాలు ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరిస్తారని, 17న ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు హెచ్ఎంలకు ఆదేశాలు ఇవ్వామన్నారు.

పశుగణనపై శిక్షణ

ప్రజాశక్తి - పాలకొండ

21వ అఖిల భారత పశుగణనపై శిక్షణా తరగతులను శనివారం నిర్వహించారు. జిల్లాలోని సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు ఐదేళ్లకొకసారి పశుగణన నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలకొండ, సీతంపేట, వీరఘట్టం, భామిని మండలాలకు చెందిన సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లకు పాలకొండలో శిక్షణ జరిగింది. జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎస్.మన్మధరావు అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గల 2,69,677 కుటుంబాలను పశుసంవర్ధక శాఖ నుంచి ఎంపిక చేసిన 294 మంది ఎన్యుమరేటర్లు, 25 మంది సూపర్వైజర్లను ప్రతి ఇంట్లో సందర్శించి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల వివరాలు నమోదు చేస్తారన్నారన్నారు. నమోదు ప్రక్రియ అంతా మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎన్యూమరేటర్ల పనితీరును పర్యవేక్షించడానికి 25మంది పశు వైద్యులు సూపర్వైజర్లుగా నియమించారు. ఈనెల 6నుంచి 10 వరకు ప్రతిరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. 2019లో 20వ పశుగణన జరిగినదని, మళ్లీ ఇప్పుడు సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 21 వరకు పశుగణన చేపట్టిందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేశారని వివరించారు. కావున పశువైద్యాధికారులు, సిబ్బంది అందరూ వారి పరిధిలోని ఇళ్లను సందర్శించి పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, పందులు, పెరటి కోళ్లు, పాలిచ్చే పశువులు, కుక్కలు, పెంపుడు కుక్కలు దాదాపు 15 అంశాలపై సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. తద్వారా పాలు, గుడ్లు, మాంసం ఇతరత్రా దిగుబడి ఎంత ఉందనేది ఈ గణాంకాల ద్వారా తెలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఎడి డాక్టర్ పి.మాణిక్యరావు, డాక్టర్ బి.శ్రీనివాస్, డాక్టర్ రమేష్, డాక్టర్ చైతన్య శంకర్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎం.సంతోష్ కుమార్, ఎన్యూమరేటర్లు పశుగణంపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించి, పశుగణనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్. మన్మథరావు

నాయకులకు పరామర్శ

ప్రజాశక్తి- సీతానగరం

వైసిపి సీనియర్ నాయకుడు, పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ కన్వీనర్ పోల ఈశ్వరనారాయణ ఎడమ కాలికి ఇటీవల కాలంలో గాయమై చికిత్స పొందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం జోగింపేట వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య క్షేమ సమాచారం అడిగి తెలుసుకునీ ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, జెడ్పిటిసి మామిడి బాబ్జీ, బలగ శ్రీరాములునాయుడు, పార్వతీపురం పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వైస్ ఎంపిపి సిద్ద జగన్నాధం, పోల సత్యన్నారాయణ, ఎస్ తిరుపతిరావు, వై గోపాల్ నాయుడు, కార్యకర్తలు ఉన్నారు.

మాత, శిశు ఆరోగ్యంపై పర్యవేక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రజారోగ్యమే ధ్యేయంగా ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి. జగన్మోహన్ రావు సూచించారు. మండలంలో వెంకటరాయుడుపేటను శనివారం ఆయన సందర్శించారు. గ్రామంలో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల ప్రభావం ఏమైనా ఉందా, శానిటేషన్ తీరు, స్ప్రేయింగ్ నిర్వహణ తదితర వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. వైద్య సిబ్బంది నిర్వహించిన సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆర్‌సిహెచ్, ఎంసిపి రికార్డుల్లో గర్భిణీలు, పిల్లల టీకాల గడువు తేదీలను, టీకాల వేస్తున్న తేదీలతో సరి చూశారు. గర్భిణులతో మాట్లాడి అంగన్వాడీ కేంద్రంలో అందజేస్తున్న పౌష్టికాహారం వినియోగిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. పిల్లలు, గర్భిణిల్లో రక్త హీనత, బరువు తక్కువ ఉండే స్థితి లేకుండా అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం అక్కడ ప్రజలతో డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎవరైనా సీజనల్ వ్యాధులకు గురయ్యారా అని అడిగారు. తాగడానికి వినియోగిస్తున్న నీరు గురించి తెలుసుకొని ఎప్పటికప్పుడు నీటి స్వచ్ఛత పరీక్షలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పలు రకాల వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రైడే అందరూ పాటించాలన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో అంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జయగౌడ్, ఏఎన్ఎం రామలక్ష్మి, ఆశ తదితరులు ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న టి.జగన్మోహన్‌రావు

పర్యావరణ హితమే పొలంబడి లక్ష్యం

ప్రజాశక్తి - పాచిపెంట

ఖర్చులు తగ్గిస్తూ మేలైన సాగు పద్ధతులను అనుసరిస్తూ పర్యావరణానికి హాని జరగకుండా అధిక దిగుబడులు సాధించే దిశగా రైతును తయారు చేయడమే పొలంబడి లక్ష్యమని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పెదకన్నూరు, శతాభి రాయివలస, ఇప్పలవలస రైతులకు శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు మొక్కజొన్న పంటను వదిలి అధిక ఆదాయాన్నిచ్చే చిరుధాన్యాల సాగు, ఒలుసులు(నైజర్) వంటి పంటలను సాగు చేసుకోవాలని, 90శాతం రాయితీపై గిరిజనులకు విత్తనాలు పంపిణీ జరుగుతుందన్నారు. ఏకపంట విధానాన్ని విడనాడి బహుళ పంటలను పండించడం ద్వారా మిత్ర పురుగుల సంఖ్యను పెంచవచ్చని బహుళ పంటల విధానం ద్వారా తేనెటీగల సంఖ్య కూడా పెరుగుతుందని, దీనివల్ల పరపరాగ సంపర్కం జరిగి అనేక పంటల్లో దిగుబడులు పెరుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా రైతులకు వరుసల్లో రాగి విత్తనాన్ని నేరుగా నాటుకునే విధానంపై శిక్షణ ఇచ్చారు. బీజామృతంతో శుద్ధి చేసిన విత్తనాన్ని వరుసల్లో వేసుకుని గట్టు చుట్టూ బొబ్బర్లు వేయించారు. ఈ సందర్భంగా శతాభి గ్రామ సర్పంచి రామయ్య మాట్లాడుతూ వలసలు విస్తీర్ణం పెంచాలన్న చిరుధాన్యాలు నాణ్యమైనవిగా నూర్పిడి చేయాలన్న సిమెంట్ ఫ్లాట్ ఫారం ఉండాలని తెలిపారు. అప్పుడు నూర్పిడి నాణ్యంగా జరిపి ఎలాంటి మట్టి పెళ్లలు, రాళ్లు లేనటువంటి నాణ్యమైన చిరుధాన్యాలను తయారు చేయవచ్చని తెలిపారు. అనంతరం ఎపిసిఎంఎల్ టు సురేష్ బీజామృతం తయారీ, విత్తనశుద్ధిని రైతులకు వివరించారు. కార్యక్రమంలో విఎఎలు కిరణ్, దినేష్, ప్రకృతి ప్రతినిధులు రాజు, సంజీవ్, రైతులు పాల్గొన్నారు

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి - పాలకొండ

డివిజన్ కేంద్రమైన పాలకొండలో భారీ ఎత్తున వర్గీకరణ వ్యతిరేక ర్యాలీ శనివారం జరిగింది. వీరఘట్టం రోడ్ కార్గిల్ సెంటర్ నుంచి యలాం సెంటర్లో గల అంబేడ్కర్ విగ్రహం వరకు మాలలు కదం తొక్కారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్‌సి వర్గీకరణను కేంద్రం పున్న సమీక్షించాలని, రాష్ట్రంలో ప్రభుత్వం జిల్లా వారీగా వర్గీకరణ చేస్తామనడం రాజ్యాంగ విరుద్ధమని, దళితులు ఐక్యంగా ఉండాలని నినాదాలు చేశారు. అలాగే మాలలు అందరూ ఒకే గూటికి చేరి మాజీ ఎంపి హర్షకుమార్ నాయకత్వంలో పోరాటం ఉధృతం చేయాలని చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో దళిత సంఘం డివిజన్ నాయకులు లిల్లీ పుష్ప నాధం, రాష్ట్ర మాల రాష్ట్ర కన్వీనర్ నూతలపాటి భరత్ భూషణ్, మన్యం జిల్లా కన్వీనర్ బత్తిన మోహన్, లుంబూరు సర్పంచ్ ఉపేంద్రకుమార్, కొంచాడ జాన్, గణేష్ బాబు, జీవరత్నం, రామారావు, నాగరాజు, మడపల ప్రసాద్, గురుబిల్లి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈనెల 21న తలపెట్టిన దేశ వ్యాప్త భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.


ర్యాలీ చేస్తున్న దళిత నాయకులు

మంత్రి శ్రీనివాస్‌కు ధన్యవాదాలు

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని జోగంపేట గ్రామానికి చెందిన బొమ్మినాయిని ప్రశాంత్‌కు వికలాంగ పింఛను డబ్బులను ఆన్‌లైన్ ద్వారా ఈనెల 4న చెల్లించి పింఛను రద్దు కాకుండా చూసిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు పింఛను దారుని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. మూడు నెలల పాటు వరుసగా పెన్షన్ తీసుకోకపోతే రద్దవుతుందన్న దృష్ట్యా తమిళనాడు రాష్ట్రంలోని తిరుచ్చినపల్లిలో ఎంబిఎ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రశాంత్ తన పెన్షన్‌పై రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వాట్సాప్ ద్వారా వివరించగా ఆయన తక్షణమే స్పందించారు. తన సమస్యను పరిష్కరిస్తానని వెంటనే వాట్సాప్ ద్వారా తనకు తెలిపారన్నారు. మంత్రి ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర అధికారులకు ఆదేశాలు జారీ చేసి తనకు ఆన్‌లైన్ ద్వారా పింఛను సొమ్మును అందించే చర్యలు తీసుకున్నారన్నారు. గతంలో కరెంట్ షాక్‌తో కుడిచేయి పోగొట్టుకున్న తనకు వచ్చే పెన్షన్ నిలుపుదల కాకుండా ఎన్‌డిఎ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవడం పట్ల ప్రశాంత్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ప్రశాంత్‌తోపాటు అతని కుటుంబ సభ్యులు లక్ష్మణరావు, గంగమ్మ, మనోహర్ వెంకటరమణలు, జోగంపేట గ్రామ పెద్దలు ధన్యవాదాలు తెలిపారు.

పూడిక తీత పనులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కాలువల్లో తొలగిస్తున్న పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ డిఇ పి.కిరణ్ కుమార్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా నియోజకవర్గ పరిధిలో ఉన్న మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.40 లక్షల నిధులు మంజూరు చేయడంతో మున్సిపల్ పరిధిలో గల వరహాల గెడ్డ కాలువతో పాటు, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి పాత బస్టాండ్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో పేరుకుపోయిన పూడికలను, 30వార్డుల్లో ఉన్న కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీతలను జెసిబి సహాయంతో ప్రైవేట్ కార్మికులతో తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో పాటు కాలువల్లో తీసిన పూడికలు యుద్ధప్రాతిపదికన ట్రాక్టర్లతో తరలిస్తున్నట్లు తెలిపారు.

'శివ్వాం' దీక్షలకు ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

శివ్వాం దళితుల భూ సమస్యతో పాటు జిల్లాలో ఇతర భూ సమస్యలపై జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు కొమరాడ మండల ప్రజా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. సమస్య పరిష్కారం కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద గత కొన్ని రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా శనివారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ శివ్వాంలో దళితులపై పెత్తందార్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమస్యపై ఇప్పటికి 15 రోజుల పాటు రిలే నిరాహార దీక్ష చేసిన అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేసినా అధికారుల్లో ఏమాత్రం చలనం లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి శివ్వాం దళితుల భూమిని వారికి అప్పజెప్పాలని, అలాగే జిల్లాలో ఎక్కడెక్కడ భూ సమస్య పెండింగ్ ఉన్నాయో వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శివ్వాం దళితులపై దాడి చేసిన పెత్తందారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని కోరారు. అలాగే జిల్లాలో పేదలు సాగు చేస్తున్న భూములకు డిపట్టాలు ఇవ్వాలని, పట్టాలిచ్చి భూములు అప్పజెప్పాలని,అన్యాక్రాంతమై పెత్తందార్ల చేతుల్లో ఉన్న భూములు వెంటనే తిరిగి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రెడ్డి శివున్నాయుడు, అడివయ్య, వెంకటేష్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొల్లి సాంబమూర్తి

వదలని గజరాజులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల పరిధిలోని నాగూరు గ్రామంలో శనివారం ఏనుగులు బీభత్సం సృష్టించాయి. రైసుమిల్లు షటర్లు విరగ్గొట్టిన అనంతరం ఏనుగుల గుంపు రైసు మిల్లులోకి చొరబడి బియ్యం, దాన్యం బస్తాలను చిందర వందర చేశాయి. శుక్రవారం రాత్రి వరకు తోటపల్లి గ్రామ సమీపంలో సంచరించిన ఏనుగుల గుంపు శనివారం నాగూరు గ్రామ సమీపంలోని రైసుమిల్లు వద్దకు చేరుకుని బియ్యం, దాన్యం, బస్తాలను చిందర వందరగా పారవేయడంతో దాదాపు 80 వేల రూపాయలు నష్టం వాటిల్లిందని రైసుమిల్లు యజమాని బోగి సత్యనారాయణమూర్తి తెలిపారు. నాగూరు గ్రామ సమీపంలో ఏనుగుల హల్‌చల్ చేయడంతో ప్రజలు భయా ందోళనలకు గురవుతున్నారు. రైసుమిల్లులో విధ్వంసం సృష్టించిన విషయం తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షులు అక్కేన మధుసూద నరావు రైసు మిల్లును పరిశీలించారు. ప్రస్తుతం ఏనుగులు సంచరిస్తుండడంతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు భయాందోళనలకు గురవుతున్నారని చెప్పారు. రోడ్డుపై ఏనుగులు సంచరిస్తుండడంతో వాహనదారులు భయపడుతూ ప్రయాణం సాగించాల్సి వస్తుందని అందుకు అటవీ శాఖ అధికారులు తక్షణమే ఈప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.


రైసు మిల్లులోకి ప్రవేశిస్తున్న ఏనుగులు

నిర్వాసిత కాలనీలో సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గిజబ నిర్వాసితుల కాలనీలో సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కాలనీ నిర్మాణం చేపట్టిన సమయంలో సిమెంట్ రహదారులతో పాటు ఆయా వీధులకు వెళ్లేందుకు వీలుగా కాలువలపై కల్వర్టు నిర్మించారు. కల్వర్టులపై వేసిన పలకలు విరిగిపోవడం వల్ల ప్రజలకు ఇబ్బంది నెల్కొంది. దీంతో ఏమాత్రం వర్షం కురిసినా ఎక్కడికక్కడే నీరు నిల్వ ఉండిపోతుందని వాపోతున్నారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పూర్తిస్థాయిలో ఇంటింటికి కొళాయిలను ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందులకు గురవుతున్నామని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. నిర్వాసితుల కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ నిధులు మంజూరు నిమిత్తం చర్యలు చేపట్టడం లేదని పంచాయతీ సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, మాజీ ఎంపిటిసి మండల శంకరావులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని నిర్వాసితుల కాలనీలో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కల్వర్టు పలకల పరిశీలన

కాలువలపై వేసిన కల్వర్టు పలకలు పగిలిపోవడంతో ఇఇపిఆర్‌డి గోపాలరావు శనివారం వాటిని పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.


శిథిలమైన పలకలను పరిశీలిస్తున్న ఇఇపిఆర్‌డి గోపాలరావు

సిఎం హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ పాడేరులో మెడికల్ కళాశాల, కొమరాడ మండలం లోని పూర్ణపాడు-లాబేసు వంతెన, పాలకొండ ఏరియా ఆసుపత్రి భవన నిర్మాణం నిర్దిష్టమైన కాల వ్యవధిలో పూర్తి చేయాలని కోరారు. అలాగే సీతంపేట ఐటిడిఎ పరిధిలో పసుపు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. అలాగే సిఎం ప్రస్తావించకపోయినా షెడ్యూల్డ్ గ్రామాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి కోరారు.

కురుపాంలోని గిరిజన ఇంజనీరింగ్ కళాశాలను కూడా పూర్తి చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో, గిరిజన సంస్థల్లో ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అకస్మాత్తుగా ఐటిడిఎ పిఒల బదిలీల నేపథ్యంలో ఐఎఎస్‌లనే ఐటిడిఎ పిఒలుగా నియమించాలని, సచివాలయంలో పనిచేస్తున్న ఎఎన్ఎంలను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, కళాశాల వసతి గృహంలో నియమించే కన్నా గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఆదివాసీ ఆరోగ్యం పేరుతో నియమించిన ఎఎన్ఎంలనే తిరిగి నియమించాలని కోరారు.

బోసిపోయిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన శిక్షణ తరగతులకు సర్పంచులు, సచివాలయ కార్యదర్శులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఈ నెల 10వ తేదీ నుండి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు మండలంలోని 34 పంచాయతీల పరిధిలో సర్పంచులు, 34 మంది పంచాయితీ కార్యదర్శులు హాజరు కావలసి ఉన్నప్పటికీ శనివారం ముగింపు శిక్షణ తరగతి కార్యక్రమానికి మూలలంక సర్పంచ్, సంత నర్సిపురం ఎంపిటిసి, 12 మంది కార్యదర్శులు మాత్రమే హాజరయ్యారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జిపిడిపి అభివృద్ధి కోసం ఎంతో ఉపయోగపడతాయని శిక్షణ తరగతులు నిర్వహిస్తే పెద్ద ఎత్తున సర్పంచులు గ్రామ కార్యదర్శులు హాజరు కాకపోవడంతో అధికారుల నిర్లక్ష్యమే కారణమని పలువురు బహిరంగ విమర్శిస్తున్నారు.

ఆంధ్ర, ఒడిశా రహదారిలో తనిఖీలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆంధ్ర ఒరిస్సా అంతర్ రాష్ట్ర రహదారిలో శనివారం పార్వతీపురం రూరల్ ఎస్ఐ దినకర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. శనివారం పార్వతీపురం మండలం వెంకంపేట వై కూడలిలో నార్కోటిక్స్‌కు సంబంధించిన పోలీసు కుక్కలను వినియోగించి ఎపి మీదుగా ఒడిశా నుండి రాకపోకలు సాగిస్తున్న వాహనాలను ఆపి వాటి వివరాలను నమోదు చేసుకుని పోలీసు జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పై అధికారుల సూచనలు మేరకు గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా జరగకుండా నిర్దేశిత ప్రాంతాలలో నిఘాలను ఉంచి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంగన్వాడీ సహాయకురాలు మృతి

ప్రజాశక్తి- భామిని

మండలంలోని గురండి గ్రామానికి చెందిన అంగన్వాడీ సహాయకురాలు గువ్వాడ సుమతి(37) జ్వరంతో మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. గత మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న సుమతి, తన కన్నవారు ఊరుకి వెళ్ళింది. అక్కడ నుండి వైద్యం నిమిత్తం కొత్తూరు, కొత్తూరు నుంచి శ్రీకాకుళం వెళ్లే క్రమంలో మృతి చెందింది. మృతురాలికి భర్త గువ్వాడ నూకరాజు, ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఉన్నారు. 15 రోజులు క్రితం గురండి గ్రామంలో ఒక డెంగీ కేసు నమోదు అయినట్టు వైద్యులు నిర్ధారించారు.

గర్భిణికి డెంగీ

ప్రజాశక్తి- సాలూరు

మండలంలోని కొత్తవలస పంచాయతీ ఎగువ దాగరవలస గ్రామానికి చెందిన గర్భిణీ మహిళ చింతల చంద్రమ్మ (22) గత వారం రోజులుగా డెంగీ జ్వరానికి విజయనగరంలోని ఘోషాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏడో నెల గర్భిణీ అయిన చంద్రమ్మకి జ్వరం రావడంతో స్థానిక పిహెచ్‌సి వైద్యుల సలహా మేరకు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్ళారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు చంద్రమ్మని ఘోషాసుపత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది.

నేరాలు ఘోరాలు

రైలు పట్టాలపై యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - భామిని

మండలంలోని దిమ్మిడిజోల గ్రామానికి చెందిన ఈరోతు అప్పలస్వామి, సావిత్రిమ్మల మూడో కుమారుడు ఈరోతు కార్తీక్ (28) ఐటిఐ పూర్తి చేసి, జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లి కంపెనీలో చేరాడు. హైదరాబాద్ నుంచి ఇంటికీ వస్తామని గురువారం బయలుదేరిన కుమారుడు, శుక్రవారం రాత్రి శ్రీకాకుళం రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై శవమై కనిపించాడు. టికెట్ ఆధారంగా వివరాలు సేకరించిన పోలీసులు తల్లి తండ్రులకు సమాచారం అందించారు. ఇంటికి వస్తాడన్నా కొడుకు మరణ వార్త విన్న తల్లితండ్రులు కన్నీరుమున్నీరై విలపించారు. కార్తీక్ మరణవార్తతో దిమిడిజోల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీకాకుళంలో శవపంచనామ అనంతరం కార్తీక్ మృతదేహాన్ని తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని వెంకంపేట గోరీల వద్ద చోటు చేసుకుంది. అవుట్ పోస్ట్ పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా గాజువాకలోని గణేష్ నగర్‌కు చెందిన షేక్ రోషన్(26) పార్వతీపురం పట్టణంలో సీలింగ్ పనులు చేస్తున్నాడు. పనులు ముగించుకొని శుక్రవారం రాత్రి తిరిగి తన గదికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని బాలగోడబ నుంచి అడ్డాపుశిల గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న 268 నాటు సారా ప్యాకెట్లను శనివారం ఎస్ఇబి పోలీసులు పట్టుకున్నారు. నాటు సారా అక్రమ రవాణా చేస్తున్న వెలగాడ విజయ్, గంగ అను ఇద్దరు వ్యక్తులతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.